# వివిధ దేశాలలో కార్మికుల ఆందోళనలు

**యు.కె.**

బర్క్‌షైర్‌లోని బుర్గ్ మరియు అల్టర్‌మాస్టన్‌ల వద్ద నున్న యు.కె.అణ్వాయుధ కర్మాగారాలలో విధులు నిర్వహిస్తున్న దాదాపు 600మంది 2017 జనవరి 20, 21 తేదీలలో సమ్మె చేశారు. వీరి పెన్షను హక్కులను కుదించేవైపుగా, పెన్షను పథకానికి విధించిన నిబంధనలను వీరంతా వ్యతిరేకించారు.

తిరిగి ఫిబ్రవరి 21న వీరంతా 24 గం॥సమ్మె చేశారు. రెండు కర్మాగారాలలో పనిచేసే కార్మికులు లండన్‌లో ప్రదర్శన నిర్వహించారు; రక్షణమంత్రిత్వశాఖ కార్యాలయాల వద్దకు నిరసన ప్రదర్శన చేపట్టారు.

జూన్ 29న మరోమారు ఈ కార్మికులు ఒక్కరోజు సమ్మె చేసి తమ డిమాండ్లను పునరుద్ఘాటించారు; అలాగే ఆగస్టు 10,14 మరియు 24; సెప్టెంబర్ 7,11,21 తేదీలలో వీరి సమ్మెను కొనసాగించారు. అలాగే ఓవర్‌టైమ్ పనిచేయబోమని నిర్ణయించుకొని జూన్ 29 నుండి వీరు దీనిని కొనసాగిస్తున్నారు.

**థాయ్‌లాండ్**

సీవాల్యూ గ్రూప్‌కు చెందిన సీఫుడ్ ఎగుమతి కంపెనీలోని 2 వేల మందికిపైగా వలస కార్మికులు 2017 జనవరి 30న యాజమాన్యానికి ఓ విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. వేతనాల పెంపును, మెరుగైన పని పరిస్థితులను డిమాండ్ చేశారు. విదేశీ కార్మికులు యూనియన్‌గా ఏర్పడటం నిషిద్ధమైన ఓ దేశంలో కార్మికులు ఈ నిరసన చేపట్టారు. వీరిలో అత్యధికులు మయన్మార్‌కు చెందినవారే.

మహాఛాయ్‌లోని గోల్డెన్ ప్రైజ్ ఫిష్ కంపెనీలో పనిచేసే 800 మందికి పైగా బర్మాకార్మికులు 2017 మార్చి 12న కంపెనీ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్మికుల హక్కుల అతిక్రమణను వీరు నిరసించారు. పాస్‌పోర్టులకు, నూతన గుర్తింపుకార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు తమను అనుమతించాలని, అసమంజసమైన వేతనాల కోతలను ఆపివేయాలని, మరుగుదొడ్లకు మరమ్మత్తులు చేపట్టాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలని ఈ కార్మికులు డిమాండ్ చేశారు.

**శ్రీలంక**

శ్రీలంక టెలికామ్ సంస్థలో పనిచేస్తున్న హేమన్ క్యాపిటల్ సొల్యూషన్‌కు చెందిన దాదాపు 2100 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులు, 2016 డిసెంబర్ 26న విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. తమకు శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని, తగిన సౌకర్యాలను, రక్షణ పరికరాలను సమకూర్చాలని వారంతా డిమాండ్ చేశారు. ఆపై వారంతా నిరవధిక సమ్మె చేపట్టారు.

2017 జులై 4న శ్రీలంక పోస్టల్ కార్మికులు 19వేల మంది విధులను బహిష్కరించి దేశవ్యాపితంగా నిరవధిక సమ్మె చేపట్టారు. నెవేరా, ఎలియా, క్యాండీ, గ్యాలేలలోని పురాతన వారసత్వ జాబితాలోనున్న పోస్టల్ శాఖకు చెందిన మూడు భవనాలను విక్రయించే ప్రభుత్వ పథకాన్ని కార్మికులంతా తీవ్రంగా వ్యతిరేకించారు. అలాగే ఐఎంఎఫ్ నిర్దేశిత ప్రైవేటీకరణ కార్యక్రమాన్ని పోస్టల్‌శాఖలో అమలు చేయటానికి సిద్ధంగావున్న ప్రభుత్వ విధానాన్ని కూడా కార్మికులు తీవ్రంగా వ్యతిరేకించారు.

**దక్షిణకొరియా**

ఉల్సాన్‌లోని హ్యూండాయ్ హెవీ ఇండస్ట్రీస్‌కు చెందిన యూనియన్లలో సంఘటితబడిన నౌకా నిర్మాణ కార్మికులు దాదాపు 1500 మంది 2017 ఫిబ్రవరి 23న విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. వేతన ఒప్పందంపై చర్చలు విఫలం కావటాన్ని; నౌకా నిర్మాణం, నౌకా నిర్మాణేతరం పేరిట పరిశ్రమను రెండుగా చేయాలనే ప్రతిపాదనను వీరంతా తీవ్రంగా వ్యతిరేకించారు.

**బంగ్లాదేశ్**

హబీగంజ్‌జిల్లా-చౌనాఘట్‌కు చెందిన దాదాపు 5వేల మంది టీతోట కార్మికులు 2017 మార్చి 11న ఒకరోజు నిరసన దీక్ష చేపట్టారు. ప్రభుత్వం ప్రత్యేక ఆర్థికమండలి పేరిట పెద్దఎత్తున భూములను ఆ ప్రాంతంలో సేకరించటాన్ని వీరంతా వ్యతిరేకించారు. ప్రజల ఆధ్వర్యంలో సాంప్రదాయకంగా సాగుచేయబడుతూ, కొద్దిపాటి ఆదాయాలుగల వారికి ఏదో మేరకు తోడ్పాటుగా వుండే ఆ భూములన్నింటిలో 100 సెజ్‌లకు అనుమతి నివ్వాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వీరంతా తీవ్రంగా వ్యతిరేకించారు.

**బ్రెజిల్**

దేశవ్యాపితంగా 2017 మార్చిలో ప్రభుత్వం చేబట్టబోయే కార్మిక సంస్కరణలను వ్యతిరేకిస్తూ కార్మికులు దాదాపు 10 రోజులపైగా నిరసనాందోళనలు, ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించారు.

బ్రెజిల్‌లో పోస్టల్ ఉద్యోగులు 2017 ఏప్రిల్ 27న సాధారణ సమ్మె నిర్వహించారు. ఉద్యోగాలలో కోతను, ప్రభుత్వం చేపట్టనున్న కార్మిక వ్యతిరేక సంస్కరణలను, పెన్షను స్కీములను వ్యతిరేకిస్తూ వీరు ఈ సమ్మె చేశారు.

2017 ఏప్రిల్ 3వ వారంలో తమ పెన్షను సౌకర్యాలను నిలబెట్టుకునేందుకు పోలీసు యూనియన్లకు చెందిన సభ్యులు బ్రెజిల్ పార్లమెంటు ఎదుట నిరసన ప్రదర్శనలు నిర్వహించి, పార్లమెంటులోకి ప్రవేశించే ప్రయత్నం చేశారు. నిరసన తెల్పుతున్న 500మంది పోలీసు అధికారులపై పార్లమెంటు రక్షణ బలగాలు భాష్పవాయువు ప్రయోగించి చెదరగొట్టారు.

**బర్మా**

యంగూన్‌లోని ఎవర్‌సన్ని ఫుడ్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న వేయిమందికి పైగా కార్మికులు 2017 మార్చి 19న తమ విధులు బహిష్కరించి సమ్మె చేశారు. మయన్మార్‌లో నూతన సంవత్సర శలవులను కేవలం 5 రోజులకే పరిమితం చేస్తూ యాజమాన్యాలు చేసిన ప్రకటనను వ్యతిరేకిస్తూ వీరు ఈ సమ్మె చేశారు. అంతకు ముందు నెలరోజుల వరకు యాజమాన్యాలు వారాంతాలలో కూడా శలవులు ఇవ్వకుండా కార్మికులచే ఓవర్‌టైమ్ శ్రమ చేయించుకున్నాయి. ఈ ఓవర్‌టైమ్ పనికి రెట్టింపు వేతనం చెల్లించకుండా, మయన్మార్ నూతన సం॥ర సందర్భంగా 15 రోజుల శలవులు ఇస్తామని వాగ్దానంచేసి, ఇపుడు దానిని కూడా అతిక్రమించి శలవులను 5 రోజులకు పరిమితం చేయటాన్ని కార్మికులు నిరసించారు.

**అర్జెంటీనా**

2017 ఏప్రిల్ 5,6 తేదీలలో దేశవ్యాపితంగా, ప్రభుత్వం అనుసరిస్తున్న నయాఉదారవాద విధానాలను వ్యతిరేకిస్తూ సార్వత్రిక సమ్మె నిర్వహించారు. దీనిలో కార్మికులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వోద్యోగులు, వివిధ విభాగాల పారిశ్రామిక కార్మికులు పాల్గొన్నారు. పేదరికాన్ని అంతంచేయాలని, నూతనంగా ఉద్యోగాలను కల్పించాలని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

**గ్రీస్**

2017 మే 18న దేశవ్యాపిత ఒక్కరోజు సార్వత్రిక సమ్మె జరిగింది. ఈ సమ్మెలో పదివేలమంది కార్మికులు పాల్గొన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పొదుపు చర్యలను వీరంతా వ్యతిరేకించారు. పొదుపు చర్యలకు నిరసనగా గ్రీస్‌లో నిర్వహించిన 50వ సార్వత్రిక సమ్మె ఇది.

2017 జూన్‌లో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు రెండు వారాలకు పైగా తమ నిరవధిక సమ్మెను కొనసాగించారు. జూన్ 27న భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. కాంట్రాక్టు కార్మికుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని వారు డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులుగానే ఒప్పందాలను పొడిగించటాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు.

**ఫ్రాన్స్**

రినౌల్ట్స్ అండ్ టిఎస్ఏ కార్ల తయారీ పరిశ్రమకు యంత్రాలను, విడిభాగాలను సరఫరాచేసే జనరల్ మోటార్ అండ్ సర్వీసెస్ ఆటో విడిభాగాల తయారీ పరిశ్రమ కార్మికులు 2017 మే చివరివారం నుండి పారిస్‌లో నిరవధిక సమ్మె చేశారు.

ప్యారిస్‌లో జనరల్ మోటార్స్ యాజమాన్యం దివాళా తీసిందనే తప్పుడు ప్రకటనలతో, కొత్త యాజమాన్యం ఈ కంపెనీని చేజిక్కించుకోనున్నదనే ప్రకటనలను వ్యతిరేకిస్తూ కార్మికులు ఈ సమ్మె చేపట్టారు.

**చిలీ**

హెచ్ అండ్ ఎమ్ డిపార్ట్‌మెంట్ స్టోర్ చైన్‌కు చెందిన కార్మికులు చిలీలో 2017 మే 30న విధులను బహిష్కరించారు. తమ ఉమ్మడి ఒప్పంద ప్రతిపాదనను రిటైల్ దిగ్గజ కంపెనీ అంగీకరించకపోవటంతో వారు ఈ సమ్మె చేయవలసివచ్చింది.

**అమెరికా**

న్యూయార్క్, న్యూజెర్సీ నగరాల్లోని స్పెక్ట్రమ్ కంపెనీకి చెందిన 1800 మంది ఫీల్డ్ అండ్ కేబుల్ సాంకేతిక సిబ్బంది 2017 ఫిబ్రవరిలో నిరవధిక సమ్మె ప్రారంభించి నాలుగు నెలలు కొనసాగించారు. వీరంతా ఏ టి అండ్ టి నుండి విడివడి ఉద్యోగ ఒప్పందం లేకుండా పనిచేస్తున్నారు.

**ఉరుగ్వే**

ఉరుగ్వేలో కోకోకోలా పానీయాన్ని సీసాలలో నింపి, పంపిణీచేసే మాంటేన్‌విడెగ్ రిఫ్రెస్కోస్ సంస్థ కార్మికులు 2017 జూన్ 23న సమ్మె చేశారు. యాజమాన్యం అనుసరిస్తున్న అసమంజస కార్మిక విధానాలను వ్యతిరేకిస్తూ వీరు ఈ సమ్మె చేశారు. ఈ కంపెనీకి చెందిన మానవ వనరుల విభాగం, కార్మికులతో చర్చలు జరుపుతూ వారికి కార్మిక యూనియన్ పట్ల అపవిశ్వాసాన్ని కలిగించే విధంగా, యూనియన్‌లో విచ్ఛిన్నకర చర్యలకు పాల్పడేటట్లు వారిని ఒప్పించే ప్రయత్నాలను కార్మికులంతా ముక్తకంఠంతో ఖండించారు.

## వివిధ దేశాలలో ప్రజల నిరసనాందోళనలు

**మెక్సికో**

ఇంధన ఛార్జీల పెంపును వ్యతిరేకిస్తూ, రాజకీయ అవినీతి దీనికి కారణమని ఆరోపిస్తూ 2017 జనవరి 1 నుండి 13వ తేదీ వరకు మెక్సికో వ్యాపితంగా నిరసన ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించారు. ఇంధన ఛార్జీల పెరుగుదలతో బస్సు ఛార్జీలు పెరిగాయి. ట్రక్కుల, ట్యాక్సీల డ్రైవర్లు, రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు ఈ నిరసనల్లో, ఆందోళనలలో పాల్గొని ఇంధన సబ్సిడీలలో కోతను వ్యతిరేకించారు.

**జర్మనీ**

'ఫ్రాంక్‌ఫర్ద్‌-ఆఫ్ఘన్‌ హిందూ సాంస్కృతిక సంస్థ' మరియు ఇతర హిందు, సిక్కు సంస్థల ఆధ్వర్యంలో 2017 జనవరి నెలలో ఆఫ్ఘన్‌ శరణార్థుల దేశ బహిష్కరణను వ్యతిరేకిస్తూ, ఫ్రాంక్‌ఫర్ద్‌లో ఒక నిరసన ప్రదర్శన నిర్వహించారు. 'శరణార్థుల బహిష్కరణను ఆపండి, వేధింపులు ఆపండి' 'మేమంతా మానవులం, వస్తువులంకాదు' 'కుటుంబాలనన్నీ ఒకే చోట నివసించనీయాలి' అనే నినాదాలు రాసివున్న ప్లకార్డులను వారు ప్రదర్శించారు.

'టర్కీలో ప్రజాస్వామ్యాన్ని' డిమాండ్‌చేస్తూ, ప్రజాభిప్రాయసేకరణ'లో 'తిరస్కరణ'కు వోటు వేయాలని పిలుపునిస్తూ 18-3-17న ఫ్రాంక్‌ఫర్ద్‌లో 30వేల మంది ప్రదర్శన నిర్వహించారు.

**ఇటలీ**

2017 జనవరి 22న రోమ్‌ నగరంలో 700మంది ప్రదర్శన నిర్వహించి, ధర్నా చేపట్టారు. వీరంతా దక్షిణ ఇటలీలోని విసెంజా నగరంలో అమెరికా సామ్రాజ్యవాదులు నిర్వహిస్తోన్న సైనిక శిబిరాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. యుద్ధాన్ని, తమ నగరంలో అమెరికా నిర్వహిస్తోన్న సైనిక శిబిరాన్ని వ్యతిరేకిస్తూ విసెంజా నగరంలో భారీ నిరసన ప్రదర్శన చేశారు.

**ఆస్ట్రేలియా**

ఆస్ట్రేలియా మూలవాసులైన వేలాదిమంది 'ఆస్ట్రేలియా డే' నిర్వహిస్తూ, ఈ సందర్భంగా 2017 జనవరి 26న నిరసన ప్రదర్శన నిర్వహించారు. కాన్‌బెర్రా నగరంలోనూ; సిడ్నీలోని పార్లమెంటు భవనంఎదురుగానూ, బ్రిస్బేన్‌లలో ఈ నిరసన ప్రదర్శనలు జరిగాయి. 'మీరు భూములు దొంగిలించారు' అని రాసివున్న ప్లకార్డులను వారు ప్రదర్శించారు. బ్రిటిష్‌ వారు సాగించిన దురాక్రమణ, హింసలకు ప్రతీక 'జనవరి 26' కావున, 'ఆస్ట్రేలియా డే'ను మరొక రోజుకు మార్చాలని వారు డిమాండ్‌ చేశారు.

**అమెరికా**

2017 జనవరి 29న, కాలిఫోర్నియాలోని లాస్‌ఏంజెలెస్‌ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఒక నిరసన ప్రదర్శన నిర్వహించారు. అధ్యక్షుడు డొనాల్డ్‌ ట్రంప్‌ శరణార్థులకు వ్యతిరేకంగా ఇచ్చిన ఆదేశాన్ని వీరంతా నిరసించారు. 'శరణార్థులకు స్వాగతం' 'మా కుటుంబ హస్తాలు' మొదలైన నినాదాలతోనున్న ప్లకార్డులను వీరు ప్రదర్శించారు.

**గ్రీసు**

యూరోపియన్‌ యూనియన్‌యొక్క సమిష్టి వ్యవసాయ విధానం(సిపిఏ)ను వ్యతిరేకిస్తూ సన్న, చిన్నకారు రైతాంగం జాతీయ రహదారులపై బైఠాయించి, నిరసనాందోళన సాగించారు. 2017 జనవరి 28న వేలాదిమంది రైతులు గ్రీసులోని జాతీయ రహదార్లపై వివిధచోట్ల బైఠాయించారు. తమ వ్యవసాయ ఉత్పత్తులను, తమ వ్యవసాయ భూములను యూరోపియన్‌ యూనియన్‌ సమిష్టి వ్యవసాయ విధానంద్వారా బడా, సంపన్న వర్గాలు తమ చేతుల్లోకి తీసుకోనున్నాయని తెలుపుతూ, రైతాంగం ఈ విధానాన్ని వ్యతిరేకించారు.

**ఇరాక్‌**

2017 ఫిబ్రవరి 11న బాగ్దాద్‌లోని తహిర్‌స్క్వేర్‌ వద్ద వేలాదిమంది నిరసనకారులు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. వీరంతా ఎన్నికల సంస్కరణలను డిమాండ్‌ చేశారు. పోలీసులతో ఆందోళనకారులు సంఘర్షించారు. పోలీసులు భాష్పవాయువు ప్రయోగించారు. రబ్బరు బుల్లెట్స్‌ ప్రయోగించారు. బాగ్దాద్‌కు రక్షణగావున్న గ్రీన్‌జోన్‌లో నిరసనకారులు జొరబడే ప్రయత్నం చేయటంతో తాము ఈ చర్యలు తీసుకోవల్సివచ్చిందని పోలీసులు పేర్కొన్నారు.

**జోర్డాన్‌**

వస్తు, సేవలపై నూతనంగా పన్నులు విధించే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, వేలాదిమంది ప్రజానీకం, దేశరాజధాని అమ్మాన్‌తోసహా దేశవ్యాపితంగా 2017 ఫిబ్రవరి 24న ఆందోళన చేపట్టారు. నూతన వస్తు, సేవలపన్ను విధించే ప్రభుత్వ నిర్ణయాన్ని, రోజురోజుకీ పెరుగుతున్న ధరలను వీరంతా ముక్త కంఠంతో వ్యతిరేకించారు. 'మేము అవినీతిని సమర్థించలేము. అవినీతిపరుల బిల్లులను మేము చెల్లించలేము' అని వీరు నినదించారు.

**అమెరికా**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8 సందర్భంగా, అమెరికాలో మహిళలు ఎర్రదుస్తులు ధరించి 'మహిళలు లేకుండా ఒ రోజు' నినాదంతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. రోజువారీ జీవితంలో మహిళలపై సాగుతున్న హింసను వెల్లడిచేస్తూ, మహిళల ప్రాముఖ్యతను నొక్కి చెపుతూ ఈ ప్రదర్శన నిర్వహించారు.

ooooo